కథ

# తొలివేకువ

ఆమె మనసులాగే ఆకాశం భోరున ఏడుస్తోంది. ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్టు ఎడతెరిపి లేకుండా వాన కురుస్తోంది.

నిర్లిప్తత ఆవరించుకున్న మనసు ఆలోచనల్తో అలసిపోతే...నైరాశ్యం నింపుకున్న కళ్లు దిగులుగా శూన్యంలోకి చూస్తున్నాయి.

వానలో తడుస్తూ...బురద నీటిలో పడవలతో ఆడుకుంటున్న మూడేళ్ల కొడుకు ఆమె దృష్టికి రావటంలేదు. పక్కబట్టలు తడిచిపోయి...చలికి టాపెగిరిపోయేలా ఏడుస్తున్న మేనల్లుడి ఏడ్పు చెవికి సోకటం లేదు. ఆమె అన్నింటికి అతీతంగా...ట్రాన్స్‌లో వున్నట్టు చూస్తోంది. ఇంతలో...

వీపు పగిలిపోయేలా దెబ్బ...ఆ వెనువెంటనే ఆ...మ్...మ్మా...బాధతో కూడిన అరుపు కలిసిపోయిన ఏడుపు.

అతి సున్నితమైన 'అమ్మ మనసు'ని తీవ్రంగా తాకింది. ఆమె వులిక్కిపడి తల తిప్పి చూసింది. ఏడుస్తూ వచ్చి తల్లి కాళ్లకి చుట్టుకుపోయాడు చిన్నారి రాబర్ట్. అప్రయత్నంగా తల్లి చేతులు ఆప్యాయంగా వాడ్ని చుట్టుకున్నాయి.

వదిన సోఫియా వైపు ప్రశ్నార్థకంగా చూసింది.

చురచురా చూస్తూ ''ఆ వెధవ వానలో తడుస్తుంటే నీక్కనిపించటం లేదూ? రేపు జలుబుచేసి ఏ మాయరోగమో వస్తే ఎవరికీ? నువ్వేమో హాయిగా ఉద్యోగం వెలగబెట్టి వచ్చి చీకట్లోకి చూస్తూ చుక్కలు లెక్కబెడుతూ కూచుంటావు! అంతా నా చావుకొచ్చింది'' ఇంకా ఏదో గొణుక్కుంటూ లోపలికెళ్లింది సోఫియా.

కొడుకుని చూసింది. తల, బట్టలు నీళ్లోడుతున్నాయి.

'ఛ...ఛ...ఏంటి ఇంత పరధ్యాన్నంగా వున్నాను' అనుకుంటూ కొంగుతో వాడి తల తుడిచింది. తడి బట్టలు మార్చటానికి కుర్చీలోంచి లేచింది. ఇంతలో సోఫియా రయ్యిన వచ్చింది.

''పసివాడు పక్కబట్టలు తడుపుకుని చలికి ఏడుస్తుంటే నిమ్మకు నీరెత్తినట్టు కూచుంటావా? బాటిల్‌లో పోసిన పాలు అలానే వున్నాయి. ఆకలితో ఏడ్చి ఏడ్చి...నా బిడ్డ గొంతెండి చచ్చినా అంతేగా?'' ఆమె కోపం తారాస్థాయిలో వుంది.

''వదినా!''

''ఏం, వున్న మాటంటే అంత పౌరుషం వచ్చిందా? నీకు ఈ రోజు హాలిడే కదా! నా చీరలు ఐరన్ చేసి పెట్టమన్నాను...అవి అలానే పడి ఏడుస్తున్నాయి. నాక్కాస్త పనిలో సాయం చేస్తే అరిగిపోతావా? లేక నీ సుకుమార...నాజూకు శరీరం కందిపోతుందా? ఈమాత్రం దానికే ఎక్కడి పనులక్కడ వదిలేసి రాజ్యాలు కోల్పోయిన మహారాణిలా కూచోనక్కరలేదు'' ఎగతాళిగా అని పాడి బట్టలు వేసి కొడుకు నోటికి పాలబాటిల్ అందించింది.

ఆ రాత్రి మేరీకి నిద్ర దూరమైంది. వదిన ఎంతలేసి మాటలంది. తను పరధ్యాన్నంగా వున్న మాట నిజమే! గాయపడ్డ మనస్సుని మరింత బాధపడేలా మాట్లాడింది. మొదట్లో మహారాణిని చూసినట్టు అపురూపంగా చూసింది.

ఆప్యాయంగా మాట్లాడేది. లాలనతో వోదార్పునిచ్చేది. ఆమె మాటల్లోను...చేతల్లోను...స్పర్శలోను నీకు నేనున్నాను అనే ఫీలింగ్ నాకెంతో గొప్ప రిలీఫ్‌నిచ్చింది. అలసిన మనసుకి చిన్న వోదార్పే కొండంత అండ. కానీ...కానీ...?

రాను రాను వదిన మాటలో...ప్రవర్తనలో ఏదో మార్పు స్పష్టంగా కన్పించసాగింది. శాలరీ అంతా ఇంట్లో ఇచ్చినా పనిలో సాయంగా వున్నా ఏదో ఒక పుల్ల విరుపుమాట లంటుంది. అయినదానికీ కానిదానికీ విసుక్కుంటుంది. తను ఇంట్లో వున్నంతసేపు సూటిపోటి మాటలంటూనే వుంటుంది.

''ప్చ్!...మహారాణిలా కూచున్నానట. వ్యంగ్యంగా అన్నా ఎంత సత్యం పలికింది. మూర్ఖంగా ప్రవర్తించి....అనవసరమైన పట్టింపులకుపోయి తన సంసార రాజ్యాన్ని చేజేతులా జారవిడుచుకుంది''

ఆ సుందర రాజ్యంలో తనకి ఎదురే లేదు. ఎన్ని విస్తృత అధికారాలు...హక్కులు...బాధ్యతలు...ఎంత స్వతంత్ర జీవనం...

ఇక్కడ ఎంత సంపాదించినా పరాన్న జీవిగానే చూడబడుతోంది. ఆప్యాయత లేదు. ఆదరణ అంతకంటే కరువయింది. పైపెచ్చు వారి సొమ్ము తేరగా తింటున్నట్టు ఛీత్కారాలు...చీదరింపులు...అసలు ఈసడింపులు, హేళనలతోనే తెల్లవారుతోంది.

తన రాజ్యంలో నిరంతరం ప్రేమలో తడిసి అనురాగంలో సేద తీరేది. తన చిరు అలకలు...ముద్దు మురిపాలని ఎంతో ఇష్టంగా మరెంతో ప్రేమగా...ఆత్మీయంగా తీర్చే భర్త...కంటి పాపలా చూసుకునే భర్త...రామకృష్ణ.

ఆ మూడేళ్లు తన కోసమే బ్రతికాడు...తనే లోకంగా జీవించాడు. తనని సుఖపెట్టటం కోసం...మరెంతో కంఫర్ట్‌గా వుంచటం కోసం...నా ఆనందాన్ని ...సుఖాన్ని తనదిగా భావించాడు. భర్తంటే ఇలా వుండాలి...భర్తంటే ఇతనే అన్పించేలా ప్రవర్తించాడు. జన్మజన్మలకి ఇతనే భర్తగా పొందాలనుకునేలా తన ప్రేమని చూపాడు.

తన ప్రేమకోసం...తనతో పెళ్లికోసం తన వాళ్లందరి ప్రేమకు దూరమయ్యాడు. కానీ తనేం చేసిందీ...చిన్న విషయానికి ఎక్కువ ఇంపార్టెన్సిచ్చింది. తన చదువు...సంస్కారం...వివేకం...వీటన్నింటినీ మించి రామకృష్ణ మీద ప్రేమ ఏమయ్యాయి? అంత ఫూలిష్‌గా ప్రవర్తించింది. గాఢాంధకారంలో మునిగిపోయింది. స్వయంకృతానికి మూల్యంగా మనశ్శాంతిని పోగొట్టుకున్నాను.

పాపం రామకృష్ణ! సౌమ్యుడు...ఉత్తముడు...తన నిర్ణయం మార్చాలని...తనని ఎంతో కన్విన్స్ చేయాలని చాలా ప్రయత్నించాడు. బతిమాలాడు. బుజ్జగించాడు. చివరికి ప్రాధేయపడ్డాడు.

అసలేం జరిగిందంటే ఆరు సంవత్సరాల క్రితం బస్టాండులో పరిచయం ప్రేమగా మారింది.

వివాహానికి ఇరువైపు పెద్దలు నిరాకరించారు. కారణం కులాంతరమే కాదు, మతాంతరం కూడా.

స్నేహితుల సమక్షంలో రిజిస్టర్ మేరేజ్ చేసుకుని కొత్త జీవితానికి ఆనందంగా ఆహ్వానం పలికాం.

ఒకే ఇంట్లో వున్నా, ఎవరి మతాలు వారివి. నేను జీసస్‌ని ప్రార్థిస్తే...రామకృష్ణ వేంకటేశ్వర స్వామిని పూజించేవాడు. మా కాపురానికి మతాలు పూజలు ఆటంకాన్ని కల్పించలేకపోయాయి.

మూడు వసంతాలు మూడు క్షణాల్లా గడిచిపోయాయి. ప్రెగ్నెన్సీ...నిండు నెలలు చాలా అపురూపంగా చూసుకునేవాడు రామకృష్ణ. సినిమాల్లో మాదిరి నాకు సీమంతం కూడా చేశాడు. మా మతంలో ఇలాంటివి లేవు. ఆ వేడుక నాకెంతో ఆనందాన్ని ఇచ్చింది.

ఓరోజు అమ్మ రోడ్డు మీద కన్పించి మాతృప్రేమ పొర్లుకురాగా వలవలా ఏడ్చింది. ''అయిందేదో అయింది. నువ్వు వట్టి మనిషివి కాదు...వంటరిగా వుండడం మంచిది కాదు. ఆ అబ్బాయిని మన మతం తీసుకోమను. మనందరం హాయిగా మన ఇంట్లోనే కలిసి వుండొచ్చు'' అంది.

మూడేళ్ల గ్యాప్ తర్వాత అమ్మని చూశానేమో ఆ క్షణంలో అమ్మ మాటలు సమంజసమే అనిపించింది. వాళ్లతో కలిసిపోవాలనిపించింది.

ఆరోజు నుంచి రామకృష్ణ మీద ప్రజర్ తెచ్చాను. ''హనీ! నీకీరోజు ఏమైంది ఇలా మాట్లాడుతున్నావు? ఎవరి మతాలతో వాళ్లం ఈ మూడేళ్లుగా హాయిగా ఆనందంగానే వున్నాంగా....ఇప్పుడు నేను కొత్తగా మతం మార్చుకోవటం ఎందుకు?'' నెమ్మదిగానే అన్నా చాలా స్పష్టంగా చెప్పాడు.

''చూడు హనీ! మనం పెళ్లికి ముందే అన్నీ చర్చించుకున్నాం. ఒకరి మతాన్ని ఒకరు వేలెత్తి చూపకూడదు. మతం మార్పిడి కోసం ఒకరినొకరు బాధ పెట్టకూడదని. ఇప్పుడు మీ వాళ్లు కలిసి ఏవో కబుర్లు చెప్పారని ఇలా మాట్లాడ్డం చైల్డిష్‌గా వుంది...అర్థరహితంగా వుంది'' మళ్లీ తనే అన్నాడు.



''అంతా వుండి అందరికీ దూరంగా ఎన్నాళ్లుండగలం? ఆలోచించండి'' వెక్కుతూ అంది.

''మతం మార్చటం అనేది నా కంఠంలో ప్రాణం వుండగా జరగదు'' దృఢంగా వుంది రామకృష్ణ స్వరం.

''అంతేలెండి. ప్రేమించి పెళ్లి చేసుకున్న నా కంటే మీకు మీ మతమే ఎక్కువ. ప్రేమించినదానికోసం మీరు ఆమాత్రం మార్చుకోలేరా?''

''......''

''అయితే మీరు మీ మతాన్ని కట్టుకుని వూరేగండి. ఇంకా నేనెందుకు? మా ఇంటికి వెళ్లిపోతాను'' వెక్కుతూ చెప్పింది.

రామకృష్ణ ఎంత చెప్పినా వినకుండా ఆ బంధాన్ని అలా దూరం చేసుకున్నాను.

రాబర్ట్ పుట్టిన తర్వాత రామకృష్ణ చాలాసార్లు కలవాలని ప్రయత్నించాడు. అమ్మ...అన్నయ్య...వదినా చాలా కటువుగా మాట్లాడి...మా మేరీ ఇక నీతో కాపురం చెయ్యదు అని అతని మొహమ్మీదే చెప్పి బాధ పెట్టారు. చిత్రంగా ఆ మాటలన్నీ తను విన్నా ఏమీ అనకుండా వూరుకుంది. అంతే.

హఠాత్తుగా తన జీవితంలో వసంతం మాయమయింది. శిశిరం కమ్ముకుని మూడేళ్లకే నూరేళ్లకు సరిపడా చేదు అనుభవాలని కానుకగా ఇచ్చింది.

బ్రతుకు యాంత్రికంగా...నిస్తేజంగా...నిస్సారంగా...రసహీనంగా మారి మనసుని ఛిద్రం చేస్తోంది.

ప్రేమానురాగాలకోసం తపించిపోతూ...'నీకు నేనున్నాను' అనే చిన్న మాట కోసం అలమటించిపోతోంది. సాంత్వన కోరుతోంది.

భార్యాభర్తల మధ్య ప్రేమ ఆర్థిక పరమైందో...శారీరక అవసరాల కోసమోకాదు, చిన్న చిన్న త్యాగాలు...కొద్దిపాటి ఎడ్జస్ట్‌మెంట్లు కూడా ప్రేమ జీవితాంతం బ్రతికుండటానికి దోహదపడతాయని మొదటిసారిగా అర్థమయింది.

తనకే కాదు, చిన్నారి రాబర్ట్‌కి కూడా తండ్రి ప్రేమ...వాడి భవిష్యత్‌కి తండ్రి పర్యవేక్షణ ఎంతో అవసరం. అంతేకాదు, రామకృష్ణ ఇంకా నాకోసం ...నా రాకకోసం ఎదురుచూడ్డం నా జన్మజన్మల పుణ్యం. మతంతో పనిలేదు, అతని సాహచర్యం ముఖ్యం.

ఆలస్యంగానైనా సరియైన నిర్ణయం తీసుకున్నందుకు ఆనందంగా వుంది. హాయిగా నిద్రపోతున్న రాబర్ట్ నుదుటిమీద ప్రేమగా ముద్దు పెట్టుకున్నాను. నీ నిర్ణయం సరియైనదే సుమా! అన్నట్టు ఆహ్లాదంగా స్వాగతం పలికింది తొలివేకువ. ★

**కర్లపూడి విజయలక్ష్మి**